క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు చీమకుర్తి రోటరీ క్లబ్ సభ్యులు సోమవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు డీవీఎల్ నరసింహారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షుడు కడప రామకృష్ణ, రోటరీ క్లబ్ ఆఫ్ మాజీ సెక్రటరీలు మన్నం నాగరాజు, మూర్తి, రోటరీ క్లబ్ సభ్యులు సత్యం మైనంపాడు, గ్రామ వైస్ ప్రెసిడెంట్ గుండవరపు సుబ్బారావు, మన్నం వెంకట్రావు పాల్గొన్నారు.

పశుగ్రాస పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న జేడీ బేబిరాణి

నాగులుప్పలపాడు: వందశాతం సబ్సిడీతో అందజేసే పశుగ్రాస పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జేడీ ఏ బేబిరాణి అన్నారు. మండలంలోని ఉప్పుగుండూరులో సోమవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడిపరిశ్రమపై రైతులు శ్రద్ధ చూపాలన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. బోరు ఉంటే అర ఎకరం వరకు పశుగ్రాసం అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. పాడిపరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం గోకులం షెడ్లకు ప్రాధాన్యత కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడిపరిశ్రమపై తగిన శ్రద్ధ చూపి ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యశాల వైద్యాధికారి జాస్మిన్, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

దుస్తులు, స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సంతనూతలపాడు: దివంగత అట్లూరి కోటిలింగమ్మ వర్ధంతిని పురస్కరించుకొని ఏకేఎస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అట్లూరి రామారావు ఎండ్లూరు అంబేద్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాల ప్రాంగణంలో 60 మంది వృద్ధులకు దుస్తులు, పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి బహుజన రచయిత, అట్లూరి రామారావు అధ్యక్షత వహించారు. ఈ పంపిణీకి కోటిలింగమ్మ మనవడైన ఎన్ఆర్ఐ అట్లూరి సుష్మానంద్ ఆర్థికసాయం అందించారు. ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకుడు టి.ఆల్ఫ్రెడ్, గుంటూరి కోటేశ్వరరావు, ఎం. నాగేశ్వరరెడ్డి, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు అన్నంగి సుబ్బారావు, మాజీ ఎంపీటీసీ కందుకూరి కాంతమ్మ, సోషల్ వర్కర్ అట్లూరి ఆదిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి



పేర్నమిట్ట స్థూపం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు

సంతనూతలపాడు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బంకా సుబ్బారావు డిమాండ్ చేశారు. పేర్నమిట్ట శాంతి నగర్ స్థూపంవద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన అమిత్ షా ఆ పదవికి అనర్హుడని, వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవిలోకి వచ్చిన వ్యక్తి రాజ్యాంగాన్ని అవమానపరిచేలా మాట్లాడడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. దేశంలో మత ఉద్రిక్తతలు రెచ్చగొట్టే విధంగా అమిత్ షా వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు అమిత్ షా వ్యాఖ్యలు ఖండించకపోవడం అంబేడ్కర్‌ను అవమానించడమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి చిన్నబాబు, తుళ్లూరిసుబ్బారావు, జూపూడి వీరనారాయణ, చీదర్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



శ్రీచైతన్య స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న చిన్నారులు



సెమీ క్రిస్మస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ఒంగోలు వన్‌టౌన్:

క్రీస్తు బోధనలు అనుసరణీయమని ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. సోమవారం మాల సేవా సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో క్రిస్టియన్ మాల పాస్టర్లు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు తన బోధనలతో అంతరాలు లేని సమాజం కోసం కృషి చేశారన్నారు. జైభీం నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రాచీన కాలంలో మానవ హక్కుల యోధుడు మోజెస్ అని తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కొత్తరాజు వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. క్రీస్తు బోధించిన శాంతి, ప్రేమ, దయ, కరుణ మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బొడ్డు రంగారావు, బూరుగు రత్నం, చప్పిడి దినకర్, అంబటి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సెమీ క్రిస్మస్ వేడుక

నాగులుప్పలపాడు: సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా చిన్నారులు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. ఉప్పుగుండూరు గ్రామంలోని రోజ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో శ్యామూల్ తన స్టడీ సర్కిల్ విద్యార్థులతో కలిసి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు క్రీస్తు పుట్టుక, లోక కళ్యాణం కోసం ఏసు క్రీస్తు బోధనలు తెలపుతూ కోలాటం ద్వారా చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది.



నీలంపాలెంలో ప్రార్థన చేస్తున్న ఫాదర్ డీఎస్ పాల్



క్రిస్మస్ వాతావరణంలో చిన్నారుల ప్రదర్శన

పండుగలతో పరస్పర సోదర భావం

ఒంగోలు వన్‌టౌన్: పండుగలు పరస్పర సోదర భావాన్ని పెంపొందిస్తాయని ఆర్ఐ అనిల్ పేర్కొన్నారు. ఒంగోలు భాగ్యనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు క్రీస్తు జననం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. శాంతా క్లాజ్ వేషధారణలతో ఆహూతులను అలరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, డీన్ శివ, కుసుమ, ప్రవీణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీలంపాలెంలో..

ఒంగోలు మెట్రో: స్థానిక నీలంపాలెం ఆర్సీఎం యూత్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ మణిబాబు, ఫాదర్ డీఎస్ పాల్, కీర్తి మెడికల్ స్టోర్ ఎండీ ఎల్.తిరుపతిరెడ్డి, సీబీ మైఖేల్, కొండ్రు రవి, ఎలిజబెత్, రమేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అంద విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసి, క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించి ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయి!

ఒంగోలు: నగరపాలక సంస్థ నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం ఈ దృశ్యం. కొప్పోలు హైవే బ్రిడ్జి కింద కొప్పోలు వైపు వెళ్లే మంచినీటి పైపులైన్‌కు ఇటీవల మరమ్మతులు చేపట్టారు. అందుకోసం తవ్విన గుంతను మట్టితో పూడ్చారు. ఈ మార్గంలో భారీ వాహనాలు వస్తుంటాయని తెలిసి కూడా అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారు. సాధారణంగా ఈ మార్గంలో నిత్యం సంచరించే ఆటోవాలాలు, బస్సు డ్రైవర్లు సైతం మరమ్మతులు చేసిన ప్రాంతం మీదుగా బస్సులు నడిపేందుకు సాహసించరు. ఇదేమీ తెలియని ఓ కంటైనర్ లారీ సోమవారం రాత్రి కొత్తపట్నం వైపు నుంచి ఈ బ్రిడ్జి కిందుగా గుంటూరు వైపు వెళ్లేందుకు ప్రయత్నించింది. మరమ్మతులు చేసిన ప్రదేశంలోకి రాగానే లారీ టైర్లు కూరుకుపోయి వాహనం ఊగిపోయింది. దీంతో డ్రైవర్ తన వాహన యజమాని దృష్టికి తీసుకువెళ్లి భారీ క్రేన్ సాయంతో లారీని బయటకు తీసేందుకు పడరాని పాట్లు పడ్డాడు. స్కూలు బస్సులు, ఆర్టీసీ బస్సులు నిత్యం తిరిగే ఈ రోడ్డులో మరోమారు ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



మట్టిలో కూరుకుపోయిన లారీని జేసీబీతో బయటకు తీసేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం

సౌత్ జోన్ ఖోఖో పురుషుల జట్టు ఎంపిక

జే.పంగులూరు: సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ ఖోఖో పురుషుల జట్టు ఎంపిక నిర్వహించారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు తమిళనాడులోని తిరుప్పూర్‌లో సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ ఖోఖో టోర్నమెంట్ జరగనున్నట్లు ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఒంగోలు ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల జట్టు ఎంపిక పంగులూరులోని స్థానిక జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఎంపికలో ప్రకాశం జిల్లా డిగ్రీ కళాశాల, బీపీఈడీ కళాశాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో 15 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. యూనివర్శిటీ ఆవిర్భావం తర్వాత మొట్టమొదటి సారిగా ఖోఖో జట్టును పంపుతున్నట్లు వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్, ప్రొఫెసర్ బి.హరిబాబు పేర్కొన్నారు. జట్టు ఎంపికలో యూనివర్శిటీ ఫిజికల్ డైరెక్టర్, పరిశీలకుడిగా జి.సాయిసురేష్, సెలక్షన్ కమిటీ మెంబర్లు పాల్గొని జట్టును ఎంపిక చేశారు.



ఎంపికైన ఏకే యూనివర్శిటీ పురుషుల ఖోఖో జట్టు

ఏకే యూనివర్శిటీ పురుషుల జట్టు

వివేకానంద బీపీఈడీ కాలేజీ, పొదిలి విద్యార్థులు జీఎస్ వి.శివ, షేక్ అహ్మద్, వీరాంజనేయులు, కె. రామ్మోహన్, యూ.గణేష్, బి.లక్ష్మీనారాయణ సిద్ధమూర్తి (బీపీఈడీ కాలేజ్, సింగరాయకొండ), డీసీఆర్ఎం డిగ్రీ కాలేజీ ఇంకొల్లుకు చెందిన క్రీడాకారులు పి.గోపి, ఎం.ప్రసాద్, వై.సుధీర్, కె. వెంకట్రావు, ఎస్.షాలేమ్‌రాజు, జే.వినయ్, ఐ.ఏలియా, వి.సిద్ధుప్రసాద్, ఎం.మంత్రూనాయక్ ఎంపికయ్యారు.

మత్తు పదార్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు

చీమకుర్తి రూరల్: కార్మికులు మత్తు పదార్థాలు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం సుకన్య, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం నగేష్ హెచ్చరించారు. మండలంలోని బూదవాడ సచివాలయ పరిధిలో ఎల్లయ్యనగర్‌లోని గ్రానైట్ వర్కర్స్‌కు సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి, డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఎవరైనా గంజాయి, డ్రగ్స్ సేవిస్తున్న తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



ఉప్పుగుండూరు గ్రామ సభలో అధికారులు

నాగులుప్పలపాడు: గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని ఉప్పుగుండూరులో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సదస్సులను సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సదస్సుకు 46 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబిరాణీ, సర్వేయర్ రత్నాకర్, ఆర్ఐ రమేష్, ఎండోమెంట్ ఈఓ రజనీ, వీఆర్‌ఓలు సుబ్బరామయ్య ఎర్రసుబ్బయ్య, శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ నరసింహారావు వర్ధంతి

ఒంగోలు మెట్రో: భారతరత్న మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 20వ వర్ధంతిని ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలు రంగారాయుడు చెరువు ఎదుట పీవీ నరసింహారావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి కోశాధికారి పింగళి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. బహుముఖ ప్రజ్ఞాశాలి, సంస్కరణలకు ఆద్యుడైన పీవీ నరసింహారావును దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందన్నారు. సమితి సభ్యులు మైనంపాటి సాయి కుమార్ మాట్లాడుతూ సరళీకృత విధానాలతో ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించి, సంస్కరణలతో దేశానికి సరికొత్త మార్గాన్ని నిర్దేశించిన దార్శనికుడు పీవీ అని కొనియాడారు. సమితి సభ్యులు పరమాత్ముని నాగేశ్వరరావు, బ్రాహ్మణ ప్రతినిధులు పాల్గొన్నారు.



పీవీ కాంస్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న డాక్టర్ శాంతకుమారి, వంశీకృష్ణ, హెచ్ఎం శ్రీదేవి

కొత్తపట్నం: స్థానిక బొమ్మిశెట్టి సీతమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ చాపల వంశీకృష్ణ సహకారంతో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయురాలు మన్నం శ్రీదేవి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతకుమారి మాట్లాడుతూ.. పేద పిల్లల విద్యాభివృద్ధికి తమవంతు సహకారం ఎప్పటికీ అందిస్తామని పేర్కొన్నారు. హైస్కూల్లో గత విద్యా సంవత్సరంలో 3 నుంచి 10వ తరగతి వరకు ప్రతిభ చాటిన విద్యార్థులకు ఉత్తమ అవార్డులు అందజేశారు. బడికి సక్రమంగా హాజరైన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందించారు. విద్యార్థులను అను నిత్యం వినూత్న కార్యక్రమాలతో ప్రోత్సహిస్తున్న గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ కోటేశ్వరరావును సత్కరించారు. మ్యూజిక్ షోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో శ్రీరామ్ హాస్పిటల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, ఖాసిం సైదా, శ్యామ్ కుమార్, గోపి ఉపాధ్యాయులు సాయి కిషోర్, చరత్ తదితరులు పాల్గొన్నారు.

'బత్తుల'కు 'బొట్ల'

కృతజ్ఞతలు



బత్తులను సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న బొట్ల సుబ్బారావు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర వ్యవసాయ మాజీ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డిని ఆయన నివాసంలో ఆ పార్టీ బీసీ సెల్ అధ్యక్షులు బొట్ల సుబ్బారావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బత్తులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘాలు, కుల సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి చంద్రబాబు మోసాలను తెలియజేయాలని బత్తుల సూచించారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కుట్టుబోయిన కోటియాదవ్, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకుడు ఫణిదపు సుధాకర్ పాల్గొన్నారు.

వీఆర్వో సంఘ అధ్యక్షునిగా శ్రీనివాసులు



వీఆర్‌ఓ సంఘ ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

సంతనూతలపాడు: మండల వీఆర్‌ఓల సంఘ అధ్యక్షునిగా రుద్రవరం వీఆర్వో ఎం. శ్రీనివాసులలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీఆర్వోల సంఘ మండల కార్యదర్శిగా మంగమూరు వీఆర్‌ఓ ఎస్ వినోద్‌కుమార్, కోశాధికారిగా చిలకపాడు వీఆర్‌ఓ కె.హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా పేర్నమిట్ట వీఆర్‌ఓ కె.జాలయ్య, ఉప కార్యదర్శిగా గురవారెడ్డిపాలెం వీఆర్‌ఓ పి.రామాంజనేయులు, ఈసీ మెంబర్లుగా పి. మధు, దాసరి శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమాన్ని వీఆర్వోల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.ఆదిరెడ్డి, జిల్లా వీఆర్వోల సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి పి వెంకటస్వామి, వీఆర్వో వెన్నెల తదితరులు పర్యవేక్షించారు.


ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు ఆహ్వానం

ఒంగోలు మెట్రో: ఈ నెల 28, 29వ తేదీల్లో విజయవాడలోని కేబీఎన్ డిగ్రీ కళాశాల ఆవరణలో 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలను కృష్ణా జిల్లా రచయితల సంఘం, ప్రపంచ తెలుగు రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ సభలకు జిల్లాకు చెందిన సాహితీ సంస్థల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు అందాయని న.ర.సం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ, కళామిత్ర మండలి(తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆహ్వానాలు ఇప్పటికే సంబంధిత కవులు, రచయితలకు నిర్వాహకులు పంపారని పేర్కొన్నారు.

మహిళలకు ఉచిత శిక్షణ తరగతులు

సంతనూతలపాడు: మండల పరిధిలోని ఎండ్లూరు డొంక వద్ద ఉన్న మహిళా ప్రాంగణంలో మహిళలకు మూడు నెలల పాటు బ్యూటీషియన్ కోర్సు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్ ట్రైనీలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రాంగణం జిల్లా మేనేజర్ వై అంజమ్మ తెలిపారు. శిక్షణ తరగతులకు ఆసక్తి ఉన్న మహిళలు 18 నుంచి 40 ఏళ్ల వయసుండి పదో తరగతి పూర్తి చేసి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 8333921346 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఫిబ్రవరి 7,8 తేదీల్లో ప్రకాశం బాలోత్సవం



బాలోత్సవం బ్రోచర్ విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

ఒంగోలు టౌన్: ఫిబ్రవరి 7,8 తేదీల్లో ప్రకాశం బాలోత్సవం నిర్వహించనున్నట్లు బాలోత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బందారు లక్ష్మీనారాయణ, కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హై అధ్యక్షతన బాలోత్సవ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలలో నిబిడీకృతమై ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు, సెల్‌ఫోన్‌కు బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా చైతన్యం చేసేందుకు బాలోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లల అభివృద్ధిలో పెద్దలు భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ ఏడాది బాలోత్సవంలో 55 అంశాలపై పోటీలు నిర్వహిస్తామన్నారు. పాఠశాలలకు జనవరి 8వ తేదీ నాటికి ఎంట్రీ ఫారాలు పంపిస్తామని చెప్పారు. సైన్సుకు సంబంధించిన అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. సమావేశంలో అమరావతి బాలోత్సవం కార్యదర్శి యువీ రామరాజు, కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ డి. వీరాంజనేయులు, కోశాధికారి ఎస్ రవి, ఆఫీస్ బేరర్లు సీహెచ్ వినోద్, బాలకోటయ్య, దామా శ్రీనివాసరావు, ఉమామహేశ్వరి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.